క్లుప్తంగా

నేడు రామకోటి అఖండ భజన

సదుం: మండలంలోని నడిగడ్డ వెంకటరెడ్డిగారి పల్లె రామాలయంలో బుధవారం ఉదయం నుంచి పుంగనూరుకు చెందిన రామకోటి భక్త బృందం ఆధ్వర్యంలో రామకోటి అఖండ కీర్తనల ఆలాపన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఇరవై నాలుగు గంటల పాటు కీర్తనాలాపన కొనసాగుతుందని చెప్పారు. అనంతరం గురువారం ఉదయం 9 గంటలకు అభిషేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మున్సిపల్ సమావేశం నేడు

పుంగనూరు: మున్సిపల్ సర్వసభ్య సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, వేసవిలో తాగు నీటి సమస్య రాకుండ తీసుకోవాల్సిన చర్యలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు వివిధ నిర్వహణల వేలం

పుంగనూరు: మున్సిపల్ పరిధిలోని ప్రైవేటు బస్టాండ్, జనరల్ షాపు గది, దినసరి మార్కెట్, వారపు సంత, ఖాళీగా ఉన్న గదులను బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వేలం వేయనున్నారు. మంగళవారం కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మంగళవారం జరిగిన వేలంలో గుత్తేదారులు అనుకున్న స్థాయిలో రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఆసక్తి గలవారు మున్సిపల్ నిబంధనల మేరకు ధరావత్తు చెల్లించి, వేలంపాటలో పాల్గొనాలన్నారు.

లారీ బోల్తా : ఇద్దరికి స్వల్ప గాయాలు

కుప్పంరూరల్: కుప్పం మండలం, నడుమూరు అటవీ ప్రాంతంలో లారీ బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్లు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం నామక్కల్ నుంచి ప్లాస్టిక్ పైపుల లోడ్‌తో కుప్పం వైపు వస్తున్న లారీ నడుమూరు అటవీ ప్రాంతంలోని ప్రమాదకర మలుపు వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్ మురుగేష్, క్లీనర్ రవి స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం తమిళనాడుకు వెళ్లారు.

ఆలయ హుండీ చోరీ

పలమనేరు: మండలంలోని గొల్లపల్లి సమీపంలోని గంగమాంబ ఆలయ హుండీ చోరీకి గురైంది. ఈమేరకు మంగళవారం ఉదయం పోలీసులకు గ్రామ పెద్దలు ఫిర్యాదు చేశారు. కాగా పట్టణ సమీపంలోని గద్దూరు కాలనీ వద్ద ఓ ఖాళీ హుండీ పడి ఉన్నట్టు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ హుండీ గంగమాంబ ఆలయానిదేనా.. ఎప్పుడు చోరీ జరిగి ఉంటుందనే విషయాలు పోలీసులు విచారిస్తున్నారు.

నగర వాటిక పనులు వేగవంతం



పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ చైతన్యకుమార్ రెడ్డి

పలమనేరు: మండలంలోని ముడివారిపల్లె నగరవాటికలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డీఎఫ్‌ఓ చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం పనులను ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గబ్బిళ్లకోటూరు వద్ద ఏనుగుల అడవిని దాటి రాకుండా నిర్మిస్తున్న కేజీఎఫ్ టైప్ సోలార్ ఫెన్సింగ్ మోడల్ పనులను పరిశీలించారు. అపోలో ఆస్పత్రి ప్రతినిధులు, ఎఫ్ఆర్వో నయీం అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

వేలం ఆదాయం రూ.6 లక్షలు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

సోమల: వేలం పాటల ద్వారా సోమల పంచాయతీకి రూ.6.06 లక్షల ఆదాయం సమకూరినట్లు ఎంపీడీఓ నాగరాజ, ఈఓపీఆర్డీ ఎస్ఏ గఫూర్ సాహెబ్ తెలిపారు. మంగళవారం సంతగేటు, బస్టాండు గేటుకు సర్పంచ్ రాజేశ్వరి అధ్యక్షతన వేలం పాటలు నిర్వహించారు. సంతగేటు హక్కులు రూ.5.23 లక్షలకు శ్రీనివాసులు, బస్టాండు గేటు హక్కులు భార్గవ రూ.83 వేలకు దక్కించుకున్నారు. గతంలో కంటే రూ.29 వేలు ఆదాయం తగ్గింది. వైస్ ఎంపీపీ ప్రభాకర, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు వరదం రమణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పది గంటలపైన పనులు చేయొద్దు

యాదమరి: కూలీలు ఉదయం 10 గంటలపైన పనులు కూడదని వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ సూచించారు. మంగళవారం కీనాటంపల్లె దళితవాడలో కూలీలతో సమావేశం నిర్వహించారు. ఎండ ఎక్కువగా ఉందని కూలీలు ఉదయం 10 గంటలలోపు, సాయంత్రం 4 గంటలపైన పనులు చేయాలని సూచించారు.

ఇది మహిళా పక్షపాత ప్రభుత్వం





మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

- మహిళలను మహారాణులుగా చేయాలన్నదే సంకల్పం
- వైఎస్సార్ ఆసరా సభలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: వైఎస్సార్‌సీపీ మహిళా పక్షపాత ప్రభుత్వమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణ వైఎస్సార్ ఆసరా మూడోవిడత కార్యక్రమం జరిగింది. జ్యోతిప్రజ్వలన చేసి వారు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెగా చెక్కును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి మహిళలు పాలభిషేకం చేశారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ఓట్ల కోసం పసుపు–కుంకుమ పేరుతో మహిళలను మోసం చేసిందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు ఆసరాగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళలు మహరాణులుగా చేయలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని పేర్కొన్నారు. మొత్తం నాలుగు విడతల్లో రూ.26వేల కోట్లను మాఫీ చేయాల్సి ఉండగా, మూడు విడతల్లో ఇప్పటికి రూ.18వేల కోట్లను మాఫీ చేసినట్లు పేర్కొన్నారు. అన్ని రంగాల్లో తమ ప్రభుత్వం మహిళలకు స్థానం కల్పిస్తోందని తెలిపారు. గతంలో వేసవి వస్తే తాగేందుకు మంచినీళ్లు లేకుండా జనం కొళాయిల వద్ద గొడవలు పడిన సందర్భాలు ఉన్నాయని, నేడు తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇన్నాళ్లూ బయటకు రాని టీడీపీ నాయకులు ఎన్నికలు సమీపిస్తుడడంతో మాయ మాటలతో మోసగించేందుకు వస్తున్నారని, మహిళలు మోసపోకూడదని సూచించారు.

రూ.7.71 కోట్ల లబ్ధి

డీఆర్‌డీఏ పీడీ రాధమ్మ మాట్లాడుతూ పలమనేరు మున్సిపాలిటీకి సంబంధించి మూడో విడత 285 గ్రూపులకు చెందిన 6,732 మంది మహిళలు రూ.7.71 కోట్ల లబ్ధి పొందారని వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మెన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీసుధా, కౌన్సిలర్లు షబ్బీర్, కోదండరామయ్య, ఆస్పత్రి కమిటీ సభ్యులు ముజ్జు తదితరులు ప్రసంగించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు చాన్మా కమాల్, కిరణ్, టౌన్ సీఎంఎం రవి, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. చిన్నారి మౌనిక నృత్య ప్రదర్శన ఆకట్టుకొంది.

ఇళ్ల నిర్మాణాలకు రుణాలివ్వండి



అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు ఆర్థికంగా ఇబ్బందులున్న గ్రూపు మహిళలకు డీఆర్‌డీఏ ద్వారా రుణాలను అందించి సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు చొరవ చూపాలను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఎప్పటికప్పుడు గృహనిర్మాణాల బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించారు. నిర్మాణాలపై వెలుగు అధికారులు స్పందించాలని సూచించారు. కొందరు ఐకేపీ సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా ఉన్నారని, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయించాలని సూచించారు. ఎంపీడీవో విద్యాసాగర్, ఈజీఎస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ పుణ్యక్షేత్రంగా బోయకొండ



సూచనలిస్తున్న పెద్దిరెడ్డి, ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ దేవస్థానాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సమష్టిగా పనిచేసి రాష్ట్రంలోనే ఆదర్శ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయ పరిపాలన కార్యాలయంలో దేవస్థానం ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పెద్దిరెడ్డి మాట్లాడుతూ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని, భక్తుల మనోభావాలు దెబ్బతీయకుండా సులభతరంగా అమ్మవారి దర్శనభాగ్యం పొందేలా చూడాలని తెలిపారు. బోయకొండను రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. సిబ్బంది అక్రమాలకు పాల్పడినా, నిర్లక్ష్యంగా వ్యవహించినా చర్యలకు సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

త్వరలో సమాచార కేంద్రం

ఈఓ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం త్వరలో సమాచార కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. పనివేళల కేటాయింపు, షిప్ట పద్ధతులను వివరించారు. సిబ్బంది సమష్టిగా పనిచేస్తూ ఆలయ ఆదాయాన్ని పెంచాలని సూచించారు. భక్తులకు దర్శనానంతరం పుష్పం, ప్రసాదం, కుంకుమ అందేలా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు ఎన్నడూలేని విధంగా ఉద్యోగ భద్రత, ఉత్తమ సేవలందించిన సిబ్బందికి బోనస్‌లు సైతం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓ చంద్రమౌళి తెలుపారు. వైఎస్సార్ సీపీ నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో చోరీ



దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ కృష్ణయ్య

రామకుప్పం: మండలంలోని వీర్నమల గ్రామంలో ఓ వస్త్ర దుకాణంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. రామకుప్పం ఎస్ఐ కృష్ణయ్య కథనం మేరకు.. వీర్నమలకు చెందిన స్వామినాథన్ ఆరిమానుపెంట–కుప్పం రహదారి పక్కన వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దుకాణం షట్టరు తాళాలను పగలు గొట్టి చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం స్వామినాథన్ కుమారుడు గాంధీ దుకాణాన్ని తెరిచేందుకు వెళ్లగా షట్టర్ తెరచి ఉంది. చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కృష్ణయ్య అక్కడికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. రూ.45 వేలు విలువ చేసే వస్త్రాలు, రూ.13 వేల విలువ చేసే సెల్‌ఫోన్, సుమారు రూ.10 వేల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సింహవాహనంపై శ్రీరాముడి విహారం

తవణంపల్లె: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తవణంపల్లె కోదండరామ స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి సింహవాహనంపై శ్రీరాముడు కొలువుదీరి విహరించారు. ఉదయం సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ఉభయదారులు ఎ.అరుణకుమార్ కుటుంబసభ్యులతో సింహ వాహనసేవ నిర్వహించారు. అర్చకులు ఉత్సవమూర్తి శ్రీరామచంద్రుడికి అభిషేకం, పూజలు చేయించి నైవేద్యం సమర్పించారు. అనంతరం సింహవాహనంపై కొలువుదీరిన శ్రీరాముడు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

రూ.74.69 లక్షల పెండింగ్ నిధుల విడుదల

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలకు రూ.74.69 లక్షల పెండింగ్ నిధులు విడుదల అయినట్లు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఏడాదికి కిందట నిధులు ఆగిపోవడంతో తరగతి గదుల నిర్మాణం పెండింగ్ పడిందని, సమస్యను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఆయన చొరవతో ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లులు పూర్తిగా విడదల చేశారని తెలిపారు. ఇకపై జరిగే నాడు–నేడు పథకంలో పనులు జరుగుతాయని తెలిపారు. ఈ ఏడాది జూన్ నాటికి పనులు పూర్తి చేసేలా పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. నాడు –నేడు పథకం కింద మరో రూ.2.50 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపిగా ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని తెలిపారు. పనులను వేగవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు.

సర్వీస్ రూల్స్ ముసాయిదాపై హర్షం

పుంగనూరు: మున్సిపల్ ఉపాధ్యాయులకు యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ ముసాయిదాను ప్రభుత్వం విడుదల చేయడంపై పీఎంటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రాజా హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సర్వీస్ రూల్స్ అతిత్వరలో అమలుకానుండడం అభినందనీయమన్నారు. ప్రభుత్వానికి మున్సిపల్ ఉపాధ్యాయుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి శ్రీనాథ్, సభ్యులు శ్రీలక్ష్మీదేవి, జ్యోతి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళా విభాగం అధ్యక్షురాలిగా జమీల



జమీలా


పలమనేరు: వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలిగా జమీలాను నియమించినట్టు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. ఇకపై వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. జమీలా మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవినిచ్చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు.

ఇంటర్ పరీక్షలకు 47 మంది గైర్హాజర్

పుంగనూరు: ఇంటర్మీడియెట్ ఫస్ట ఇయర్ పరీక్షలకు మంగళవారం 47 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మంగళవారం పట్టణంలో మూడు సెంటర్లలో పర్యవేక్షణా ధికారులు రెడ్డెప్ప, కమలాకర్, విజయకుమారి ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి. మూడు సెంటర్లలో మొత్తం 798 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా, 47 మంది విద్యార్థులు హాజరుకాలేదు.

గ్రామ స్థాయిలో సైనికుల్లా పనిచేయాలి

- రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీయే ధ్యేయం
- అభివృద్ధి చేశాం.. ఆదరించమని అడుగుదాం
- గృహసారథుల సమావేశంలో ప్రజాప్రతినిధులు



చింతమాకులపల్లె సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు

చౌడేపల్లె: గ్రామస్థాయి నుంచి గృహసారథులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు , కార్యకర్తలు సమష్టిగా సైనికుల్లా పనిచేసి రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజారిటీయే ధ్యేయంగా సైనికుల్లా పనిచేయాలని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు సూచించారు. మంగళవారం పుదిపట్ల, చింతమాకులపల్లె, కాగతి, కాటిపేరి, దిగువపల్లె సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో సమావేశం జరిగింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో చౌడేపల్లె మండలాన్ని సర్వతోముఖాభివృద్ధిగా అభివృద్ధి చేశామని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలో గ్రామాల వారీగా మౌలిక వసతులు, రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఆలయాల అభివృద్ధి, తాగునీరు, సాగునీరు కల్పనతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలను గృహ సారథులు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించిన పథకాల లబ్ధిని తెలియజేయాలన్నారు. అభివృద్ధి చేశాం.. ఆదరించాలని అడగాలని పిలుపునిచ్చారు. బాధ్యత పనిచేసి మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని కోరారు. ఎంపీపీ రామమూర్తి, సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డూరమణ, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ శ్రీరాములు, సర్పంచ్ హైమావతి, మంత్రి పీఏ మునితుకారం తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ధ్యేయం





ఆసరా సంబరాలకు హాజరైన మహిళలు, మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళ సాధికారత ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ పేర్కొన్నారు. మంగళవారం గుడుపల్లె ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భరత్ ఆసరా మెగా చెక్కును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 747 గ్రూపులకు చెందిన 7087 మంది సభ్యులకు రూ.7కోట్ల 25 లక్షల ఆసరా నిధులు మంజూరైనట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళలు గర్వంగా బతుకుతున్నారని పేర్కొన్నారు. పథకాల లబ్ధి నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలకే జమ అవుతోందని తెలిపారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా, 7సార్లు ఎమ్మెల్యేగా చంద్రబాబునాయుడు మహిళలు, పేదల అభ్యున్నతిని పట్టించుకోలేదన్నారు. మహిళలను టీడీపీ ఒక ఓటు బ్యాంకుగానే కున్నారని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు తీసుకు వచ్చారని తెలిపారు. కరోనా సమయంలో కూడ సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. జగనన్న ప్రజారంజక పాలనను చూసి ఓర్వలేక ప్రతి పక్షాలు అవాస్తవ ఆరోపణలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలను మాయమాటలతో దగా చేయడంలో చంద్రబాబు నాయుడు దిట్ట అని విమర్శించారు. మండలంలోని యామగానిపల్లెలోని శ్రీద్రౌపది, ధర్మరాజుల ఆలయ నిర్మాణానికి రూ.2 కోట్ల 50 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మల్లప్పకొండ ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం అమలు అవుతున్న ప్రతి సంక్షేమ పథకం అమలు కావాలంటే మళ్లీ జగనన్న సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అనంతరం మహిళలు ఏర్పాటు చేసిన మాల్టలను పరిశీలించారు. ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ, సర్పంచ్‌లు రామమూర్తి, చెన్నరాయన్, ఎంపీడీఓ శంకర్, ఏసీవో చంద్రశేఖర్, ఏపీఎం శ్రీనివాసులు, సీసీలు సంఘమిత్రలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీపీ యువరాజు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో పోషణ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, బాలింతలు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు మాట్లాడుతూ ఇంటి వద్దే పౌష్టికాహారం ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, రోడ్ కార్పోరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ బాలగురునాథ్, సింగిల్ విండో చైర్మెన్ ధవనంభక్త, సీడీపీఓ ప్రియదర్శిని, ఐసీడీసీ సూపర్‌వైజర్లు గీతమ్మ, సునీత, పుష్ప,లత , అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శ్రీనివాసులు, దామోదర్,సేటు,బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న అలీమ్‌బాషా, నాగభూషణం

పుంగనూరు: విద్యార్థులు పోటీతత్వంతో ఉన్నతమైన మార్కులు సాధిస్తే ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుకోవచ్చని మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా అన్నారు. మంగళవారం కొత్తయిండ్లు ప్రభుత్వ హైస్కూల్లో నేషనల్ మెరిట్ మీన్స్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)నకు ఎంపికైన 15 మంది విద్యార్థులకు చెక్కులను కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణంతో కలసి అందజేసి, అభినందించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో ఐఎఫ్‌టీయూ సభలు

కుప్పంరూరల్: తిరుపతిలో ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో జరిగే ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని అనుబంధ ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతి పిలుపునిచ్చారు. మంగళవారం కుప్పం ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వర్కర్లు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం అమలు చేయాలని, సమాన పనికి సమావేతనం ఇవ్వాలని, వర్కర్లపై పని భారం తగ్గించాలని మహా సభల్లో డిమాండ్ చేయనున్నట్లు చెప్పారు. ఈ సభలకు పెద్ద ఎత్తున అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్, సభ్యులు వెంకటరత్నం, మోహనలక్ష్మి, వర్కర్లు లావణ్య, రేష్మ, కాంచనాదేవి, భవాని, జులేఖ, పద్మావతి, ఉమ, సరస్వతి, తదితరులు ఉన్నారు.

నాలుగు లేన్ల ఏర్పాటుకు సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

చౌడేపల్లె: నాలుగు లేన్ల రహదారి ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణకు మంగళవారం తహశీల్దార్ మాధవరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ, ఆర్అండ్‌బీశాఖ అధికారులు సర్వే నిర్వహించారు. కొన్నేళ్లుగా చౌడేపల్లెలో ట్రాఫిక్ సమస్య ఉంది. రోడ్డు విస్తరణ చేస్తే ప్రయాణ మార్గం సులభతరం అవుతుంది. అధికారులు ప్రభుత్వ స్థలాల సర్వే నిర్వహించి, మార్కింగ్ వేసే పనులు ముమ్మరం చేశారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్ టీమ్



పలమనేరు డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న నాక్ బృందం

పలమనేరు: పట్టణంలోని శ్రీవర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ బృందం మంగళవారం సందర్శించింది. సిమ్లా యూనివర్సిటీ వీసీ డాక్టర్ సునీల్ గుప్తాతో పాటు సభ్యులు డేవిడ్‌పీటర్, షేర్ బహదూర్ సింగ్‌కు ఐదేళ్లలో జరిగిన కళాశాల ప్రగతిని ప్రిన్సిపల్ వెంకటేశులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశేఖరం వివరించారు. ఉన్నత విద్యకు వెళ్లినవారు, ఉద్యోగాలను సాధించిన వారు, అధ్యాపకుల బోధనా సామర్థ్యాలను తెలియజేశారు. కళాశాలలోని మౌలిక సదుపాయాలు, లైబ్రరీ, ల్యాబ్‌లను బృంద సభ్యులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అధ్యాపకబృందం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు



ల్యాబ్ సౌకర్యాలపై ఆరా తీస్తున్న జయశంకర్

పలమనేరు: ఎలాంటి వ్యాధికైనా స్థానిక ఏరియా ఆస్పత్రిలోని ల్యాబ్‌లో పరీక్షలు చేస్తారని మండల సబ్ యూనిట్ అధికారి జయశంకర్ తెలిపారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ల్యాబ్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మండలంలో వైరల్ జ్వరాలు ఎక్కువగా వస్తుండడంతో వ్యాధి నిర్ధారణ పరీక్షల విషయమై స్థానిక ఆస్పత్రిలో సిబ్బంది టెస్టులు చేస్తున్నారా లేదా అని ఆయన పరిశీలించారు. చాలామంది ప్రవేటు ల్యాబ్‌లలో ఎక్కువ ఫీజులు చెల్లించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలోని ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.